# అచ్చి రాక పోడమంటే అదే!

**-అవసరాల రామకృష్ణారావు**

దేహ సామీప్యం వల్ల పిల్లలు పుట్టుకొస్తే రావొచ్చు గాని ప్రతీ మొగుడూ పెళ్లాల జంట మధ్యా భావసారూప్యం కూడా ఉండి తీరాలంటే అదెలా సాధ్యం! చాలామందికి మల్లే రాఘవులికి రామలక్ష్మికి ఒక్క క్షణం పడి చావదు. పుట్టిన మగపిల్లలిద్దరూ కాలేజీ చదువులకి ఎదిగారు. రాఘవులికీ కూడా వాలెంటరీ రిటైర్మెంటు తీసుకుని ఇంటి పట్టున గడిపేటైమే ఎక్కువైంది. స్వతహా చురుకైనదీ వంట్టింటి ఆధునికపరికరాలకి లోటులేందీ గనక, టీవీ సీరియల్సు రానిసమయంటూ ఉంటే ఆ మధ్య హాల్లోనే గడపక తప్పదు. ఇక సాధారణంగా నిశ్శబ్ద శ్రోతగా సర్దుకుపోయే భర్త ముందు ఆవిడ నోరు వీరవిహారం చెయ్యకుండా ఎలా ఉండగలదు? అయితే ఆవిడ దాడి ఎలా ఎక్కడ మొదలెట్టినా రాఘవులి అక్క రంగమ్మ మీద కేంద్రీకృతమవకమానదు. ఆరోజు అందిన ఉత్తరం అలాంటిది.

'చూస్తూ ఉండండి. మీ అక్కకి బుద్ధొచ్చే రోజు ఎంతో దూరంలో మాత్రం లేదు. ఇవాళ నేను చెబుతున్నాను, గుర్తుంచుకోండి.'

కేవలం మౌనంగా ఉన్నంత మాత్రాన పెళ్లాం చెప్పినదాన్ని రాఘవులు అంగీకరించాడనడానికి లేదు. చిన్నప్పుడే తలచెడి ఇల్లు చేరింది. ఆస్తి పోతుందని సవతి తమ్ముణ్ణి దత్తత ఇస్తే చచ్చినట్టు భరించింది. అమాయకుడైన వాణ్ణి ఓ ఇంటి వాణ్ణి చేసింది. మరదలు అచ్చెమ్మకి అన్నీ అప్పచెప్పి అంత వ్యవసాయమూ వృద్ధిలోకి తెచ్చింది. ఆ ప్రాంతాలకి ఆవిడో పెద్దదిక్కు. తిథి వారాలు గాని శుభాశుభాలు గాని ఆ చుట్టుప్రక్కల ఎవరొచ్చి అడిగినా ఉచిత సలహా ఇచ్చి శక్తికొద్దీ సమాజసేవ చేస్తోంది. అస్తమానూ ఎందుకో అందుకు రంగమ్మక్కని ఎత్తిపెడితే గాని దీనికి ఉండబట్టదు కాబోలు!

'మీకేం, మీ మగాళ్లకి ఏం తెలుస్తాయి, లోలోపలి మా ఆడాళ్ల అగచాట్లు! ఏ పెద్ద పండుక్కో మనల్ని ఆ పల్లెటూరికి పిలిచి బట్టలు పెట్టి పంపిస్తేనే బుట్టలో పడిపోడానికి మీలాంటి వెర్రితనమేమీ నాకు లేదు! పాపం ఆ అచ్చెమ్మ నాతో ఎన్ని చెప్పుకుని ఏడ్చిందో! అంటూ చెప్పినవే మరిన్ని జోడించి ఎప్పటికప్పుడు అందజేస్తూ ఉంటుంది రామలక్ష్మి.

అచ్చెమ్మ కాపరానికి వచ్చిన మొట్టమొదటి రోజే రంగమ్మ హెచ్చరించిందిట.

'చూడొసే అచ్చీ, పుట్టింటికొచ్చి యిలా తగలడ్డాను గాని మా ఆచారాలన్నీ, తు.చ. తప్పకుండా అత్తింటి వారివే. అమలు చెయ్యక తప్పదు గదా! ఎందుకు చెబుతున్నానంటే మా వాళ్లకి దాసీది అచ్చిరాదుటమ్మా! ఇల్లూడ్చుకోడం, వంటొండుకోడం, ఆ గిన్నెలు కడుక్కోడం, అంతే కాదు, బట్టలుతుక్కోడం కూడా ఆడాళ్లు చేసుకోవలసిందే! పైవాళ్ల చేత బట్టలు ఉతికించుకోడం అచ్చిరాదని మా వాళ్లు ఎంత మొత్తుకున్నా, మా పెదమావగారో ఎవరో పొరపాటున ఓ గావంచాగుడ్డ చాకలాడికి వేశారట. అంతే. అది తిరిగి రాకుండానే ఆయనకి ఒళ్లు తెలియని జొరమొచ్చి కొట్టేసిందిట!'

ఇలా సమస్త చాకిరీనీ అచ్చెమ్మకి అంటగట్టిన రంగమ్మకి ఇటు ఆడపడుచూ అటు అత్తగారూ కలగలసిన హోదా కదా అదీ నిలబెట్టుకోకపోతే ఎలా! తమ్ముడు సోమరాజు సుకుమారుడనీ, అందుకే వాణ్ణి మెట్రిక్‌తోనే ఆపించి వ్యవసాయప్పనుల్లో తిప్పుకుంటున్నాననీ, వాణ్ణి వేరే పడుకోనిస్తేనే ఆరోగ్యప్రదమని ఆయుర్వేద వైద్యులు చెప్పేరనీ ఏవేవో చెబుతూ తనకి లభించని సంసార జీవన సుఖాన్ని అచ్చెమ్మకి కూడా దొరక్కుండా వీలైనంత అడ్డుపడుతూ ఉండేదిట రంగమ్మ. అయినా ఇద్దరు ఆడ పిల్లలు పుట్టకనూ పోలేదు. వాళ్లని పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు సహా చేసి పంపకనూ తప్పలేదు. ఓ మానసిక పరిపక్వత వచ్చిన నలభై దాటిన ఈ వయస్సుల జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకున్నానేమో అనే చింత అచ్చెమ్మనిప్పుడు మరీ క్రుంగదీసేస్తోందిట. ఆవిడకి ఆ కోరిక ఎక్కువైన కొద్దీ 'అబ్బ, నాకు నీరసంగా ఉందే, నాకు దూరంగా జరగవే' అని భర్త పెడమొహం పెట్టడం ఈ మధ్య అచ్చెమ్మలో మరీ చిచ్చురేపుతోందిట. ఓసారి సిగ్గు విడిచి రంగమ్మ దగ్గిర బయటపెడితే 'ఏం చేస్తాం అచ్చీ, నాకో రకం. నీకో రకం. ఈ యింటి ఆడాళ్లకి మగాళ్ల సుఖం అచ్చిరాదేమో!' అని తేల్చేసిందిట.

కూచున్న చోట్నుంచి కదలకుండా ఏళ్ల తరబడి సాటి ఆడదాని శ్రమని దోచుకున్నదే కాకుండా, ఆమె వేదనని అంత తేలికగా 'అచ్చి రాకపోవడం' కింద జమకట్టిన రంగమ్మ దాష్టీకాన్ని వేనోళ్ల దుమ్మెత్తి పోసింది రామలక్ష్మి. ఈసారి రాఘవులు ఊరుకోలేకపోయాడు.

'ఎందుకే, ఎదురుగుండా లేనిదాన్ని పట్టుకుని ఈ రోజలా తిట్టిపోస్తున్నావ్? మా రంగమ్మక్క నీకేం అపకారం చేసిందని? వాళ్లకి జరిగిన అనుభవాల సారాంశంగా పెద్దవాళ్లో? ఏవేవో నిబంధనలంటూ పెట్టేరు. నీకు నమ్మకం లేకపోతే మానెయ్.

'ఓ యబ్బో! అచ్చిరాకపోడం అంటూ మీ అప్పచెప్పొచ్చే ఆచారాల్లోని లోతుపాతులు మీరే మెచ్చుకోవాలి. ఆ మధ్య ఓ ఎర్ర కొబ్బరి పిలక వాళ్ల పల్లెటూళ్లో వేసుకుంటారేమో అని మీరు పంపితే 'మా యింట్లో కొబ్బరి మొక్క అచ్చిరాదు రాఘవులూ!' అంటూ తిరిగి పంపేసింది, గుర్తుందా, ఎందుకో తెలుసా?'

'తెలీడానికేముంది, ఎవరి నమ్మకం వాళ్లది'

'అవునవును. వాళ్ల పక్కింటి పెరట్లో చాలా కొబ్బరి చెట్లున్నాయి. అందులో సగం వీళ్ల పెరటి కాంపౌండులోకి వాలి ఉంటాయి. రెండ్రోజుల కోసారైనా పండిన ఓ కొబ్బరి బోండాం వీళ్లింట్లో పడుతూ ఉంటుందిట. పడినది వాళ్లది కాదుగాని వీళ్లది కాదు కదా... 'తీసికెళ్లి ఇచ్చేస్తానండీ' అని అచ్చెమ్మ అంటే మీ అక్కగారి జవాబేమిటో విన్నారా?'

రాఘవులకి అప్పటికే విసిగెత్తి, ఒళ్లు మండింది, విని విని. లేచి నిలబడి నాలుగడుగులు ఇటు వేసినా ఆ చెప్పేది చెవిలో పడక తప్పలేదు.

మీ రంగమ్మక్క అంటుందిటా...

'చూడొసే అచ్చీ... ఆ యింటావిడ మహా పిసినారి. ఇంత పెద్ద కొబ్బరి తోట ఉంది. వందల కొద్దీ బోండాల్ని దింపి అమ్ముకుంటూ ఉంటుంది. పక్కింటి పునిస్త్రీవి నువ్వు. ఏనాడైనా, ఇన్నేళ్లైంది, నిన్ను పిల్చి ఇంత పసుపూ కుంకుమా యిచ్చి ఓ కొబ్బరికాయ చేతిలో పెట్టే పుణ్యానికి నోచుకుందా? ఉహూం 'దీనికి బుద్ధిలేకపోతే నా బుద్ధి ఏమైందిట' అని కరుణామయుడైన వాయుదేవుడు ఆమె తప్పుని తనే సవరించి అటుకాయలు ఇటు మళ్లిస్తున్నాడన్న మాట. అలా ఓ మంచి పని జరిగి తద్వారా వచ్చిన పుణ్యంతో పక్కింటి యిల్లాలి భర్త ఆయుర్దాయం పెరుగుతూ ఉంటే మనం అడ్డుకోవచ్చా? తప్పు కాదూ? ఇంకా ఏమైనా బొండాలు పడ్డాయేమో వెదికి యిలా తెచ్చి లోపల పెట్టమ్మా అచ్చీ!'

సరిగ్గా విన్నాడో లేదో గాని రాఘవులు తన కోపమంతా వీధితలుపు దఢాలున వేసుకోడంలో చూపించాడని గమనించి చెమటలు గ్రక్కుకుంది రామలక్ష్మి. ఇన్నాళ్లూ ఫోన్లో ఎప్పటి కబురు అప్పుడు చేరేసింది గాని ఈసారి ఏకంగా ఉత్తరమే రాసింది అచ్చెమ్మ. నిజంగా అందులోని విషయమే బయటపెడితే అక్కమీది ఆ పిచ్చి అభిమానంతో తన మక్కలే విరక్కొట్టునేమో!

తలుపేసుకుని ఆ ఉత్తరం మడత విప్పి మరోమారు చదువుకుంది రామలక్ష్మి.

లక్ష్మీ, ఇదివరకోసారి చెప్పేననుకుంటాను, కనకరాజు ఎవడో. వీళ్లకేదో దూరపు బంధువట. 'తమ్ముడు చూస్తే బలహీనపు పక్షి. ఒక్క ఆడదాన్ని ఇంతటి పొలమూ దీని వ్యవహారమూ ఎలా నడుపుకు రాగలను!' అంటూ కోత పనులప్పుడు అతన్ని రప్పించేది. కనకరాజు వెళ్లేదాకా ఇంటిల్లిపాదీ అతని అడుగులకి మడుగులొత్తవలసిందే. అందరి కంటె అతని కూడా భయభక్తులతో తిరిగేది రంగమ్మగారు. అయితే పెద్దమ్మగారు 'అందుకు కూడా సిద్ధపడిందని' పాలేళ్లంతా చెవులు కొరుక్కుంటూంటే ఓనాడు నా కళ్లతో నేను చూసేదాకా నమ్మలేకపోయాను లక్ష్మీ! ఈ వయసులో కూడా ఈవిడకీ గుణముందంటే- అదేమిటో- మధ్య నా ఒళ్లంతా ఆవిర్లు కక్కుతోంది లక్ష్మీ! వేరే చెప్పుకునే దిక్కు లేక నీకు రాశాను. చదివి వెంటనే చింపెయ్యి.ఆవిడకంటె అయిదారేళ్లు చిన్నదాన్ని. రోజంతా పనిచేసిన పాలేళ్లు చిన్న చిన్న గుడ్డలు కట్టుకుని నూతి దగ్గర స్నానాలు చేస్తూంటే చూసిన దృశ్యం కళ్లముందు నుంచి కదలడంలేదు. నేనేమైపోతానో! ఉత్తరం మాట దేవుడెరుగు, ఫోన్ అయినా చేస్తానో లేదో!

గజ గజ వణుకుతూ ఉత్తరాన్ని ఇంతింత ముక్కలు చేసింది రామలక్ష్మి. అయితే అంత తొందర్లో అచ్చెమ్మ అంతగా తెగించగలదని ఆమె అనుకోలేదు. ఆ అవకాశం కూడా అలా కలసి వచ్చింది కాబోలు.

'ఈసారి మన పొలం రెట్టింపు పండింది. ఉత్తరాదిన ధాన్యలక్ష్మీదేవి అని శక్తిమంతమైన దేవత ఉందిట. కనకరాజుని తీసికెళ్లి ఆమెకి అభిషేకం చేయించి వస్తాను' అంటూ పదివేల రొక్కంతో బయల్దేరిందిట రంగమ్మ.

రాత్రి బస్సెక్కుతారనగా సాయంకాలం అచ్చెమ్మని పిలిచి రహస్యంగా ఇలా చెప్పింది.

'చూడొసే అచ్చీ, ఏ బ్యాంకులో వేసుకుందామన్నా డబ్బుకి భద్రత లేని రోజులు. ధాన్యమమ్మిన వెయ్యి రూపాయల నోట్లన్నీ వసారాలోని పెద్ద గంగాళంలో కుక్కి ఉంచాను. దాని మీద కప్పిన పెద్ద యిత్తడి పళ్లెం తీసి అప్పుడప్పుడు లక్ష్మి చల్లగా ఉందా లేదా అని కనిపెడుతూ ఉండు. నా వంద తులాల జవహరీ నా గదిలో బొంత కింద ఉంచి మరీ వెడుతున్నాను. జాగ్రత్త సుమీ! కడుపు నిండా తిని కంటి నిండా నిద్రోడం తప్ప ఎరగని నా తమ్ముణ్ణి నీకు అప్పచెప్పి వెడుతున్నా. ఏం చేస్తాం చెప్పు. ఈ యింట్లో మగాళ్ల మాట అచ్చిరాదు మరి!'

రంగమ్మ మాట గుర్తుతెచ్చుకుంటూ అలా గోడకి జారబడి అచేతనంగా కూలబడిపోయింది అచ్చెమ్మ. తన ఇరవై ఏళ్ల కాపరంగాని, ఇద్దరు పెళ్లైన ఆడపిల్లలు గాని ఆమెకా క్షణం గుర్తురాలేదు. పెద్దలు నూరిపోసిన శీల రక్షణా ఆడదానికి కావలసిన భద్రతా ఆమెకి తెలియదనడానికి లేదు. బలీయమైన విప్లవ కాంక్ష ఆమెని ఆ క్షణంలో నడిపింది. దానికి ఊతగా దొరికినవాడే పెద్ద పాలేరు పోతురాజు. దేవతలాంటి చిన్నమ్మగార్ని చెరిచిన పాపచింతా వాడికి లేదనడానికి లేదు. ఓ పెద్ద బ్యాగుతో వాళ్లిద్దరూ ఆ చీకటి రాత్రి ఇవతలపడ్డారు. మూఢత్వానికి ముక్తాయింపులా తన పేరు గుర్తొచ్చి అచ్చెమ్మకి వెర్రి నవ్వొకటి వచ్చింది. తను ఆ గుమ్మంలో మరి అడుగు పెట్టదు. అచ్చి రాకపోడమంటే అదేనేమో! ■